క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన 'మీ సేవ' నిర్వాహకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తూ..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ మీ సేవా ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నూతన కలెక్టర్ బదావత్ సంతోశ్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మీ సేవా నిర్వాహకులు కురిమిళ్ల మహేశ్, అంకం వాసు, కేశవ్, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

డంప్‌యార్డులో చెత్త తొలగింపు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి పాత వర్క్‌షాప్ సమీపంలో గల డంప్‌యార్డు కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందునా డంపింగ్ యార్డులోని చెత్తను శనివారం తొలగించారు. గుర్తు తెలియని వ్యక్తులు డంప్‌యార్డుకు తరచూ నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగ కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా 2వవార్డు కౌన్సిలర్ సుధాకర్ డంపర్‌తో చెత్తను తొలగించారు.

పైపుల లారీ అడ్డగింత

నెన్నెల: మండలంలోని మైలారం నుంచి ప్రాణహిత చేవెళ్ల కాలువకు భారీ పైపులను తరలిస్తున్న లారీలను వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మైలారం, గొల్లపల్లి, జోగాపూర్ మీదుగా వెల్లటూర్‌కు తరలిస్తున్న భారీ పైపుల లారీలను శనివారం అడ్డుకున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీల వల్ల బీటీ రోడ్లు ధ్వంసమవుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, గుండ్ల సోమారం ఎంపీటీసీ దాగం రమేష్, నాయకులు లావుడియా రమేశ్, గట్టు బానేష్, మొహిద్‌ఖాన్, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

7న జర్నలిస్టులకు కంటి పరీక్షలు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వం చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7వ తేదీన ప్రత్యేక కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పత్రికా విలేకర్లు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ చానళ్ల జర్నలిస్టుల కోసం 7న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులు శిబిరానికి వారి ఆధార్‌కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

7న రేషన్ బియ్యం వేలం

మంచిర్యాలటౌన్: పౌరసరఫరాల శాఖ అధికారులు వివిధ సందర్భాలలో తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 7వ తేదీన బహిరంగ వేలం ద్వారా అమ్మనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్‌పహాడ్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద 7వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు వేలం ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.1లక్ష దరావత్తు కట్టేందుకు సిద్ధంగా ఉండాలని, పీడీఎస్ బియ్యం, చెక్కర, గోధుమల వ్యాపారం చేసేవారు, రైస్మిల్లర్లు ఈ వేలంలో పాల్గొనేందుకు అవకాశం లేదని తెలిపారు.

చట్టాలపై అవగాహన

జన్నారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు చట్టాలపై లక్సెట్టిపేట సివిల్ కోర్టు న్యాయమూర్తి అసదుల్ల షరీఫ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, శ్రీధర్, భూమరెడ్డి, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, హెచ్ఎం జనార్దన్, ఏజీపీ పద్మ, న్యాయవాదులు రహిమతుల్ల, సత్యగౌడ్, సుమన్, అశోక్, తాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల ఆందోళన



తాండూర్: రైతులు పండించిన పత్తికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. మండలంలోని రేచినీ గ్రామంలో శనివారం మద్దతు ధర ప్రకటించాలని రైతులు నిరసన తెలిపారు. క్వింటాల్ పత్తికి కనీస మద్దతు ధర రూ.15,000 ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు మెట్‌పల్లి ధర్మయ్య, రేచిని గ్రామ ఉపాధ్యక్షుడు ఎర్ర శంకర్, నాయకులు శేఖర్, సంతోష్, పోశం, శంకర్, కమల, గౌరక్క, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నా.. పట్టించుకోరా?

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ సభ్యులు

దండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ తమ నివేదికలు చదివి వినిపించారు. సభలో సాగునీటి అంశం ప్రస్తావనకు రాగానే ఇరిగేషన్ ఏఈఈ సంజీవపై కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, మోహన్, నవీన్, కమలాకర్, హేమలత, సర్పంచ్ చంద్రకళ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీరందక, పంట పొలాలు ఎండుతున్నా పట్టించుకోరా అని నిలదీశారు. వారబందీ పద్ధతిలో కడెం నీటిని డిస్ట్రిబ్యూటరీ 28వరకు అందిస్తామని చెప్పినా అక్కడి వరకు నీళ్లు రావడం లేదని, దీంతో పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా కాంగ్రెస్ సభ్యులందరూ సభ పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. నిరసనలో భాగంగా సాగునీటి ఇబ్బందులను గుర్తించి ఎమ్మెల్యే దివాకర్‌రావు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపణలు చేయడంతో బీఆర్ఎస్ సభ్యులు జోక్యం చేసుకుని, ఎమ్మెల్యేపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారని అనడంతో, కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సాగునీటి కోసం మేం నిరసన తెలిపితే మీరు చూస్తు ఉంటారా? మీకు రైతు సమస్యలు పట్టవా అంటూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై మండిపడ్డారు. దీంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఎస్సార్ఎస్పీ నుంచి నీటిని తెచ్చి కడెం ప్రాజెక్టులో నింపి, సాగునీరందించి పంటలు ఎండిపోకుండా చూడాలని తీర్మానం చేసి ఇరిగేషన్ ఏఈఈకి అందించారు. వ్యవసాయానికి 3ఫేజ్ కరెంటు ఇవ్వాలని సభ్యులు విద్యుత్ అధికారిని కోరారు. గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పలువురు సభ్యులు సమస్యను అధికారుల దృష్టికి తెచ్చారు. 'మనఊరు–మనబడి'లో ఎంపికైన దండేపల్లి ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు త్వరగా చేపట్టాలని ఎంపీపీ శ్రీనివాస్ ఎంఈవో రవీందర్‌ను కోరారు. వీటితో పాటు సభలో పలు సమస్యలపై చర్చించారు. ఎంపీడీవో మల్లేశం, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అసంపూర్తిగా వంటషెడ్డు

అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంట షెడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి నిలిపి వేసినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి : కొమ్మెర రాధాకృష్ణమూర్తి, ఎంఈవో ఫోన్ నంబర్ : 91107 90392

వంతెన ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న టూటౌన్ కాలనీ ప్రజలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని టూటౌన్ ప్రాంత ప్రజలు మంచిర్యాలకు వచ్చేందుకు ఉన్న రైల్వే బ్రిడ్జిని ఇటీవల మూసివేసి, అండర్‌బ్రిడ్జిని ప్రారంభించడం వల్ల కాలినడకన వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కాలినడక బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ టూటౌన్ ప్రాంత ప్రజలు శనివారం రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే గేటు ఉన్న చోట కాలినడక వంతెన నిర్మిస్తేనే ఈ ప్రాంతంలోని ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. వెంటనే వంతెన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జైపాల్‌సింగ్, దేవిసత్యం, పిట్టల నర్సయ్య, ముత్యాల రామస్వామి, మహ్మద్ జలీల్, శివ కుమార్, కట్కూరి రాకేశ్, రాపర్తి కిషోర్, అశోక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



జైపూర్: మండలంలోని ముదిగుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం స్థానిక సర్పంచ్ దూట జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి చిన్నారులకు అక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఎం రాణి, మాజీ సర్పంచ్ రామగౌడ్, దూట పండరి, దూట భీమరాజ్, దూట వెంకటేశ్ పాల్గొన్నారు.

పదోన్నతికి రాత పరీక్ష



నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని గనులలో విధులు నిర్వర్తిస్తున్న అంతర్గత అభ్యర్థులకు ఏరియాలోని వృత్తి శిక్షణ కేంద్రంలో చార్జర్ సేఫ్టీ ల్యాంప్ రాత, ప్రాక్టికల్స్ పరీక్షలను శనివారం నిర్వహించారు. ఎస్ఓటూ జీఎం త్యాగరాజు మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతిలో భాగంగా ఈ రాత, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి పదోన్నతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీజీఎంలు అరవింద రావు, చిరంజీవులు, సర్వే అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వృత్తి శిక్షణ కేంద్రం అధికారి రామారావు, అధికారులు బాపయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

జన్నారం: మండలంలోని కలమడుగు శ్రీ నరనారాయణ స్వామి 38వ వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ పూజారులు శ్రీ కాకర నర్సయ్య, రాజనరేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఉదయం శ్రీ నరనారాయణస్వామి, ఆంజనేయస్వామిలకు అభిషేకం చేశారు. అనంతరం వంద మంది మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కార్తిక్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్ కుమార్, ఉప సర్పంచ్ రాజుగౌడ్, ఆలయ పెద్దలు అంజగౌడ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న ప్రతీ కార్మికుడు, ప్రతీ ఉద్యోగి క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని ఏరియా జీఎం సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం జీఎం కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రతీ కార్మికుడు, ఉద్యోగి, వారి కుటుంబ సభ్యులు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకొని క్యాన్సర్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎస్ ఓటూ జీఎం త్యాగరాజు, ఏరియా ఇంజనీర్ రమేశ్‌బాబు, కార్పొరేట్ ఇంజనీర్ కుమార్, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, డీవైజీఎంలు గోవిందరాజు, అరవిందరావు, ఏజెంట్లు గోపాల్‌సింగ్, సత్యనారాయణ, అధికారులు రాము, చంద్రశేఖర్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని దొనబండ గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ మంచిర్యాల వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉంటేనే నివారణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సుబ్బారాయుడు, ఎంపీడీవో అబ్దుల్‌హై, ఎంపీవో శ్రీనివాసరెడ్డి, బెల్లంపల్లి అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి పూర్ణిమ, సర్పంచ్ జాడి సత్యం పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామంలోని రుష్యముఖ పర్వతంపై గల ఆలయంలో శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి పాదాలతో గ్రామంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మేళతాళాల నడుమ భాజాభజంత్రీలతో నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని కల్యాణ వేడుకలు నిర్వహిస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. జెడ్పీటీసీ వేల్పుల రవి, ఎంపీపీ మంగ, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, రైతుబంధు కో–ఆర్డినేటర్ బలికొండ కిషన్, కౌన్సిలర్లు తిరుపతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రాచర్‌గడ్‌కు తరలిన ఆదివాసీలు

కాసిపేట: మండలంలోని కుర్రేఘాట్ గ్రామంలో పహండి కూపర్‌లింగుస్వామి ఆలయం గురుస్వామి భూదేశవ్ సమక్షంలో ఆదివాసీలు కూపర్‌లింగుస్వామి మూల పవిత్ర ప్రదేశం చత్తీస్‌గడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలోని రాచర్‌గర్‌కు శనివారం తరలివెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు మడావి వెంకటేష్, పేంద్రం శంకర్, సిడాం గణపతి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల	
శ్రీనివాస	:మైఖేల్
వెంకటేశ్వర	: వీరసింహారెడ్డి
జెమిని సినిమా స్క్రీన్ 1	: పఠాన్ / రైటర్ / మైఖేల్
జెమిని సినిమా స్క్రీన్ 2	: బుట్టబొమ్మ / వారసుడు
లక్సెట్టిపేట	
మహానంద	: మైఖేల్
జన్నారం	
రాఘవేంద్ర	: వాల్తేరు వీరయ్య
చెన్నూర్	
శ్రీశ్రీనివాస	: మైఖేల్
బెల్లంపల్లి	
రామకృష్ణ	:మైఖేల్
బాలాజీ	: పఠాన్
సీసీసీ	
దేవి	: పఠాన్
తిరుమల	: మైఖేల్

- మంచిర్యాలటౌన్

సంక్షిప్త వార్తలు

పీఎస్‌బీ వినియోగంపై అవగాహన

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామంలో వరిపంట పొలాలను ఇన్‌చార్జి వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ సందర్శించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. పీఎస్‌బీ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో సంతోష్, రైతులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావోయిస్టు ప్రభావిత గ్రామాలు మద్దిమాడ, రాంపూర్, గస్పూర్‌లో దేవాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం 120మంది వృద్ధులు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

నెన్నెల: మండల కేంద్రంలోని లోటస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ఉచిత యూనాని వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ యూనాని ఆరోగ్య కేంద్రం డాక్టర్ షమీనాయాస్మిన్ తెలిపారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి యూనాని ఆయుర్వేదిక మందులు పంపిణీ చేశామన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన

నెన్నెల: మండలంలోని నందులపల్లిలో ఈజీఎస్ ఏపీవో నరేష్, కార్యదర్శి పద్మనాభం ఉపాధి కూలీలకు పనులపై శనివారం అవగాహన కల్పించారు. అధిక సంఖ్యలో కూలీలు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్, ఈజీఎస్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

హోంగార్డ్‌ను పరామర్శించిన సీఐ

చెన్నూర్: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పని చేస్తున్న హోంగార్డ్ నక్క రమేష్‌కు ఇటీవల శస్త్ర చికిత్స కాగా శనివారం చెన్నూర్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలోని నలుగురు విద్యార్థులకు మంచిర్యాల మహిళా తరంగిణి ఆధ్వర్యంలో దాతలు సత్యం, రామాంజనేయులు, వొజ్జల అనిరుద్ శనివారం కుట్టు మిషన్లు అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన పాలవేణి రాకేష్ ఇన్విటేషన్ యూసీఏఐ ఫోర్త్ ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ క్రికెట్ కప్–2023 చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు పోటీలు జరగనుండగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న రాకేశ్‌కు ఎన్నారై వెంకట కృష్ణారెడ్డి అండగా నిలిచారు. శనివారం రూ.6వేలు ఆర్థిక సాయం అందించి భరోసానిచ్చారు.

కీళ్ల మార్పిడితో అరుదైన ఘనత



పేషెంట్‌తో ఆసుపత్రి వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పల్లవి ఆసుపత్రి వైద్యులు కీళ్లమార్పిడిలో అరుదైన ఘనత సాధించారు. ఐదేళ్లుగా తుంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న పేషెంట్‌కు ఆసుపత్రి వైద్యులు బొల్లబత్తిని రాజు ఆపరేషన్ చేసి తుంటి సమస్యకు పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రామకృష్ణాపూర్‌కు చెందిన తేజావత్ లక్ష్మి 5ఏళ్ల క్రితం ప్రమాదంలో గాయపడగా తుంటి భాగంలో తీవ్ర గాయం కాగా ఆమెకు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. అయినా కాలు పూర్తిగా బాగు కాకపోవడంతో మూడేళ్ల క్రితం నుంచి నొప్పితీవ్ర కావడంతో హైదరాబాద్ వెళ్లినా ఫలితం లేకపోవడంతో పల్లవి ఆసుపత్రిలో సంప్రదించారని తెలిపారు. వైద్యులు హిప్ రిప్లేస్‌మెంట్ ఆపరేషన్ ద్వారా సమస్యకు పరిష్కారం దొరుకుతుందని, 'అడ్వాన్స్‌డ్ మినిమల్లీ ఇన్‌వాసీవ్ లాంగ్ స్టెమ్ హిప్ రిప్లేస్‌మెంట్' ఆపరేషన్ చేసి విజయవంతం చేశామన్నారు. 15రోజులకే పేషెంట్ నడవడంతో పాటు పనులు చేసుకోవడంతో పేషెంట్, తమ కుటుంబ సభ్యులు డాక్టర్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణురాలు సాయి శృజ, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభిస్తున్న అతిథులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేటలో మౌంట్ కార్మల్ ఉన్నత పాఠశాలలో శనివారం నాల్గో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్, 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ అదనపు కమాండెంట్ ఎం.ఐ.సురేశ్, మంచిర్యాలరూరల్ సీఐ సంజీవ్, ఫాదర్ జోష్, మదర్ జియో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సంబురాలు ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రదర్శించిన వివిధ సాంస్కృతి ప్రదర్శనలు, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వామ్యమయ్యారు.

నర్సరీల సందర్శన



భీమారం: మండలంలోని పోలంపల్లి, ఆరెపల్లి గ్రామాల్లో నర్సరీలను శనివారం ఎంపీడీవో శ్రీనివాస్ సందర్శించారు. నర్సరీలోని మొక్కలకు రోజూ నీటిని అందించాలన్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటించాలన్నారు. ప్రతి మొక్కనూ కాపాడుకోవాలని సూచించారు.

భీమిని: కన్నెపల్లి మండలంలోని గొల్లగట్టు గ్రామ పంచాయతీని ఎంపీడీవో రాధాకిషన్, ఎంపీవో సతీష్‌కుమార్ సందర్శించారు. గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని వీకర్స్ కాలనీలోని పద్మశాలీ భవనంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం 196మంది పేదలను వైద్యులు పరీక్షించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, బీజేపీ నాయకులు రజనీష్, హరిగోపాల్, ప్రభాకర్, వేముల మధు, చంద్రమౌళి, గంగన్న పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి సెల్‌ఫోన్ అప్పగింత

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డిపోలో విధులు నిర్వర్తించే ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ బస్సులో మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను ఆ ప్రయాణికురాలికి తిరిగిచ్చి నిజాయితీ చాటుకున్నాడు. డిపో మేనేజర్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో శనివారం ప్రయాణికురాలి బంధువుకు సెల్‌ఫోన్ అప్పగించారు.

నూతన భవనం నిర్మించాలని వినతి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న జూనియర్ కళాశాల భవనానికి నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెవెన్యూ తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందించారు. కళాశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, భవనం పై పెచ్చులు ఊడి పడుతుండడంతో భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు పట్టించుకుని నూతన భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిరుపతి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.